# ఘాటీ ఘాటీ

హారర్ స్టోరీ



బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు

స్పోట్టలుపడ్డ సత్తు చిప్పలా ఉందా ముఖం... రాజేసిన చింత నిప్పుల్లా కళ్లు... గారపట్టిన పారల్లా పళ్లు... నేలకేసి నొక్కబడ్డ బలిసిన గొంగళిపురుగులా ముక్కు.... వడలిపోయిన కాకరకాయల్లా చెవులు.... పీల్చి పీకేసిన తాటిపండు పీచులా జుత్తు...

టక్కున తల తిప్పేశాను. నా భార్యకై కేకేశాను.

తను వచ్చింది వంటింటిలోనించి.

హాలులో – టీపాయ్ మీది అద్దం కింద ఉన్న డ్రాయింగ్ షీటు మీది ఆ ముఖం మరో మారు చూశాను.

''కంపరంగా ఉంది'' చెప్పాను నవ్వేసి.

''నా క్ర్యాడా'' చెప్పింది నా భార్య వెంటనే.

''అదేమిటి? నువ్వే గీశావుగా'' అన్నాను.

''ఆc రాబోవు రోజుల్లో మీరు... ముఖ్యంగా మీ ముఖం ఎలా అవుతుందో అనుకొని గీసిందది'' చెప్పింది చురుగ్గా.

ఫక్కున నవ్వేను.

''ఆ నవ్వు ఆపండి'' అంది నా భార్య చిరాగ్గా, విసురుగా.

నెమ్మదిగా నవ్వు ఆపాను.

''ఈ రోజు మీరు ఆఫీసుకు వెళ్లలేదు ఎందుకు?'' అడిగింది ఆగి.

''ఆదివారం కనుక'' చెప్పాను.

''కనుక మీరు కూడా...పోనీ, వారంలో ఈ రోజైనా ఆ సిగరెట్లు మానేయండీ'' చెప్పింది.

''ఓహో. పొగతాగడం వలన నేను... నా ముఖం ఇలా కాబోతుందనా!'' అని, ''అబ్బ ఛ'' అన్నాను. గబగబా నవ్వేశాను.

''దయచేసి నా మాట వినండి'' అంది నా వంకే చూస్తూ.

''కుదరదు శ్రీమతి గారు... పొగ రుచి, మజావేరు డియర్. అనుభవిస్తేనే తెలిసేది.''అని ''ఒక్క... ఒకే ఒక దమ్ము పట్టు... నీకే తెలుస్తుంది'' అన్నాను.

''ఛ'' అంటూ కదిలి, ఆమె వంటింటిలోకి వెళ్లిపోయింది విసవిసా.

నేను నవ్వుకుంటూ 'డైలీ'ని టీపాయ్ మీద పడేసి, సోఫాలో కూర్చున్నాను.

సిగరెట్టు ముట్టించుకున్నాను. టీపాయ్ మీద పెట్టె, లైటర్ పెట్టాను.

'డైలీ' అందుకున్నాను.

''ఒరే. యాష్ ట్రే'' అన్నాను వంటింటి వైపు నా భార్యకై చూస్తూ.

అలికిడి లేదు.

''ప్లీజ్ రా'' అన్నాను.

నా భార్య వచ్చి, మా గదిలోంచి యాష్ ట్రే తెచ్చి నా ముందు టీపాయ్ మీద పెట్టింది.

''థాంక్స్'' అన్నాను నవ్వుతూనే.

''ఊహూ'' అంటూ తిరిగి వెళ్లిపోయింది వంటింటిలోకి.

పొగ పీలుస్తూ వార్తలు చదువుతున్నాను.

డోర్ బెల్ మోగింది. సిగరెట్టుని యాష్ ట్రేలో నొక్కేశాను తలుపు తీశాను.

ఎదురుగా ఒక యువకుడు!

''నమస్కారమంకుల్'' చేతులు జోడించి అన్నాడు.

వాడు... అతి ప్రయత్నంతో గుర్తు పట్టాను. శ్రీనివాసరావు కొడుకు!

''కమల్'' అన్నాను.

వాడు నవ్వేడు.

లోనికి కదులుతూ రమ్మనమన్నాను.

ఇద్దరం టీపాయ్‌కి ఎదురెదురుగా కూర్చున్నాం.

నా భార్య డ్రాయింగ్ 'డైలీ'చే కప్పబడింది.

''ఎవరండీ'' అంటూ నా భార్య వచ్చింది చీరకొంగుకు చేతులు అద్దుకుంటూ.

నేను చెప్పాను.

''కమలా! ఏమిటోయ్ అలా ఐపోయావు? బాగున్నావా కమల్'' అంది వాడ్నే చూస్తూ.

వాడు నవ్వేశాడు, యాష్ ట్రే మీది నించి చూపునెత్తి.

మరో కుర్చీలో, వాడి ప్రక్కనే కూర్చుంది నా భార్య.

''మా శ్రీనివాస్ ఎలా ఉన్నాడు'' అడిగాను.

''బాగున్నారంకుల్'' చెప్పాడు కమల్, చిన్నగా కదిలి.

''ఏమిటి ఇలా... సడన్‌గా వచ్చావు. చాన్నాళ్లయింది'' అన్నాను.

''అవును. ఇక్కడకు మీరు వచ్చేసిన తర్వాత మనం కలిసేది ఏది!'' అన్నాడు వాడు.

''అవునవును. కానీ, మీ నాన్న నేను 'సెల్' స్నేహం కొనసాగిస్తున్నాం అడపా దడపా'' అన్నాను నవ్వుతూ.

''అవునట... ఆ మధ్య మీ అనారోగ్యం గురించి నాన్న చెప్పారు...'' అన్నాడు వాడు.

''ఆc ఏదోలే. ఇప్పుడు బాగుంది'' చెప్పాను.

వాడు ఏమీ అనలేదు.

''అమ్మ ఎలా ఉంది'' అడిగింది నా భార్య కమల్‌ని.

''బాగుంది. పాపం బాధ పడుతోంది...'' వాడు ఏదో చెప్పుతున్నాడు.

నేను, శ్రీనివాసరావు ఒకే ఆఫీసులో క్లర్కులుగా, సుమారుగా ఐదేళ్లు కలిసి పని చేశాం. ఉద్యోగరీత్యా విడిపోక తప్పలేదు. నేను ఇక్కడకు వచ్చేసి రెండేళ్లు దాటింది.

సిగరెట్టు తీసి ముట్టించుకున్నాను.

''అంకుల్ సిగరెట్లు కాల్చకండి'' వెంటనే కమల్ అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. తేరుకొని నవ్వేను.

''చాల్లేవోయ్. రుచి ఎరిగిన నువ్వు కూడా నా భార్యలా సిగరెట్లు కాల్చొద్దంటే విడ్డూరం అనిపిస్తోంది'' అన్నాను.

''లేదంకుల్. కాల్చొద్దు'' అన్నాడు వాడు కాస్త విసుగ్గా.

నిజంగానే నాకు వింతగా ఉంది. దొంగచాటుగా, తర్వాత విచ్చలవిడిగా సిగరెట్లు తెగ కాల్చే కమల్ తీరు నాకు వంటపట్టడం లేదు!

ఎన్నిమార్లని, నేనూ చెప్పాను, కమల్‌కి, 'సిగరెట్లు కాల్చొద్దు' అని. అబ్బే నా మాటలు పెడచెవిన పెట్టేసే వాడు. పైగా, 'మీరు మాని నన్ను మానమ



నండి' అని ఎదురు తిరిగేవాడు.

అటువంటిది, ఇప్పుడు కమల్ ఇలా వారించడం, నిజంగా విస్మయం కలిగిస్తోంది.

కుక్కర్ విజిల్ ఇచ్చింది. నా భార్య లేచి వంటింటి వేపు వెళ్లింది.

''వద్దంకుల్. సిగరెట్లు కాల్చకండి'' మళ్లీ అన్నాడు కమల్.

వాడ్ని చూశాను. నన్నే సూటిగా చూస్తున్నాడు.

''అనుభవించి చెపుతున్నాను. పొగ త్రాగడం మంచిది కాదు ముమ్మాటికి'' అన్నాడు కమల్ నిక్కచ్చిగా.

నాకు నవ్వు వచ్చింది. నవ్వేశాను.

చేతులు జోడించి, నమస్కరిస్తూ, ''వద్దంకుల్. దయచేసి ఇప్పటినుండి వాటిని మానేయండి'' అన్నాడు వాడు.

''ఏమిటోయ్. ఇది చెప్పడానికే పని కట్టుకు వచ్చినట్టు మాట్లాడుతున్నావ్'' అన్నాను నవ్వును బ్రేక్ చేసి.

''అవునంకుల్. అందుకే వచ్చాను'' అన్నాడు కమల్.

''సర్లే కానీ, ఏమిటి ఇలా వచ్చావు సడన్‌గా'' అడిగాను.

''మిమ్మల్ని చూసి పోదామని. ముఖ్యంగా 'పొగ త్రాగొద్దని, రిక్వెస్టు చేద్దామని వచ్చాను...'' కమల్ చెపుతున్నాడు.

'సెల్' రింగవుతోంది. అది గదిలో ఉంది.

వంటింటి వైపు చూశాను. నా భార్య పనిలో ఉన్నట్టు ఉంది.

లేచి గదిలోకి వెళ్లాను.

శ్రీనివాస్... శ్రీనివాసరావు నుండి ఫోన్...

''హలో'' అన్నాను. ''చెప్పరా శ్రీనివాస్. మీ వాడు ఇప్పుడే వచ్చాడు'' అని కూడా చెప్పాను.

''ఎవడూ... కమలేనా!'' అటు శ్రీనివాస్ గొంతు పీలగా ఉంది... ఆత్రుతతో ఉంది!

''అవున్రా'' చెప్పాను.

''నీ దగ్గరకూ వచ్చాడా!'' అటు గందరగోళం...

''నా మాట విన్రా.... వాడు ఎక్కడ ఉన్నాడు...''

''హాలులో.... నేను గదిలో ఉన్నాను. విషయం ఏమిటి? ఏమిటా తొట్రుబాటు?'' అన్నాను గబగబా

''వాడు... వాడు... ఇప్పటికిప్పుడే... చాలా మంది.... నా ఫ్రెండ్స్‌ను... కలిశాడట. ఇప్పుడు నేను ఫోన్‌చేసిన వాళ్లల్లో చాలామంది వాడి రాక గురించే చెపుతున్నారు...'' శ్రీనివాస్ చెపుతున్నాడు.

''నీ దగ్గరా సిగరెట్లు మానమని మొరపెట్టుకున్నాడా...'' అడిగాడు వెంటనే.

''అవున్రా'' అన్నాను. ఏమీ అర్థం కావడం లేదు.

''ఒరే... కమల్... చనిపోయాడురా'' చెప్పాడు శ్రీనివాస్ సడన్‌గా.

గతుక్కుమన్నాను.

''ఎలా... రా...'' అడిగాను.

''స్మోకింగ్ వాడి ఊపిరినాడనీయలేదురా.... ఉదయం హఠాత్తుగా.... చనిపోయాడు...'' శ్రీనివాస్ చెప్పాడు బొంగురుగా.

'లైన్' కట్ చేశాను – ''సారీ రా. వస్తున్నాను'' అని అనేసి.

భారంగా కదిలాను. బయటకు వచ్చాను. హాలులో .... కమల్ లేడు... వెన్నులో వణుకు కొనసాగుతోంది... వంటింటి గుమ్మంలోనే ఆగిపోయాను.

నన్ను చూసి నా భార్య –

''కమల్ వెళ్లిపోయాడు. కాఫీ వద్దన్నాడు. అర్జంట్‌గా ఏదో ఊరు వెళ్లాలట. మీతో చెప్పేయమన్నాడు'' అంది. వెంటనే మళ్లీ అంది. ''మీతో మరీ మరీ చెప్పమన్నాడు... సిగరెట్లు మానేయమని''

వెన్నులో వణుకు ఆగి... పో..... యి...ం...ది.

*